

# అనగనగా ఓ నాన్న

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**ఒకప్పుడు** డి.ఎన్.ఏ పరీక్ష ఫలితాలు రావడానికి ఆరువారాలదాకా పట్టేది. కానీ రోజుల తరబడి ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా స్వల్ప కాలంలోనే ఫలితాలని రాబట్టేలా అమెరికాలోని వర్జీనియా విశ్వవిద్యాలయం పరిశోధన బృందం ఒకటి ఆ విధానాన్ని సరళీకరించింది. ఫలితంగా ఇరవై నాలుగు గంటలనించి నలభై ఎనిమిది గంటలకి ఆ కాలం తగ్గింది. లేండర్స్ అనే డాక్టర్ రూపొందించిన, చేతిలో ఇమిడిపోయే ఓ పరికరం గంటలోనే ఫలితాలని ఇస్తుంది. కానీ అది ఇంకా ప్రభుత్వ హాస్పిటల్స్‌లోకి రాలేదు.

మర్నాడు సాయంత్రం త్రివిక్రం లేబ్‌కి వెళ్ళి, ఆ టెక్నీషియన్ కోసం చూసాడు. అతను త్రివిక్రంని చూసి పని అయిందన్నట్లుగా తల ఊపి కవర్ల దొంతరలోంచి ఓ కవర్ని వెదికి తీసిచ్చాడు. ఆ కవర్ తెరిచి అందులోని రిపోర్ట్ కాగితం బయటికి తీస్తుంటే త్రివిక్రం చేతులు స్వల్పంగా వణికాయి.

ఆ కాగితం బయటికి తీసి దానికున్న మూడు మడతలు విప్పి తెరచి అందులో రాసింది చదివాడు.

అతను లేబ్‌లోంచి అలెగ్జాండర్ దగ్గరకి వచ్చేసరికి ఆయన కళ్ళు మూసుకుని చేతిలోని రోజరీని తిప్పుతూ, దైవ ప్రార్ధన చేస్తున్నాడు. త్రివిక్రంని చూసి నర్స్ ఓసారి ఆయన్ని తడితే కళ్ళు తెరిచి త్రివిక్రం వంక, అతని చేతిలోని కవరు వంక చూసాడు.

"అదేనా రిపోర్ట్?" అడిగాడు.

"అవును. మన డి.ఎన్.ఏలు వేరు. మనిద్దరికీ ఎలాంటి సంబంధంలేదు. మీరు నా తండ్రి కాదు."

అలెగ్జాండర్ వెంటనే చేత్తో ఛాతీ మీద క్రాస్ గుర్తుని వేసుకుని చెప్పాడు.

"గాడ్ ఈజ్ గ్రేట్. నాకు ప్రభువు తప్ప, ఈ లోకంలో మరెవరూ వద్దనుకునే పెళ్ళి చేసుకోలేదు. అలాగే పోవాలనుకుంటున్నాను. మళ్ళీ ఈ వయసులో కొత్త బంధం వద్దనుకున్నాను. ఆయన నా కోరికని మన్నించాడు."

"ఇక మిగిలిన ముగ్గురిలో ఒకరు నా తండ్రి. నా అన్వేషణని నేనింకా కొనసాగించాల్సి ఉంది." చెప్పాడు త్రివిక్రం.

"గాడ్ బ్లెస్ యు."

పది నిమిషాల తర్వాత త్రివిక్రం డాక్టర్ విరజ దగ్గరకి వెళ్ళాడు.

"నేనే మీ దగ్గరికి వద్దామని అనుకుంటున్నాను. ఏమైంది?" ఆత్రంగా అడిగింది.

"నెగెటివ్."

"వెరీ గుడ్ నేను అలెగ్జాండర్‌ని చూసాను. ఓ క్రిస్టియన్ మీ తండ్రికాకపోవడం మంచిదే"

"కానీ ఆయన క్రీస్తుని బాగా ప్రేమించే క్రిస్టియన్. మనలో తమ ఇష్టదైవాన్ని అంతగా ప్రేమించేవారు అరుదుగా ఉంటారు."

విరజ కొద్దిసేపు మాట్లాడలేదు.

"నెక్స్ట్ ఏం చేద్దామనుకుంటున్నారు?" అడిగింది.

"ముందుగా కురంగేశ్వర్‌ని వెతుకుదామని అనుకుంటున్నాను." జవాబు చెప్పాడు.

13

చాలా రోజుల తర్వాత త్రివిక్రం మళ్ళీ ఆ రాత్రి స్ఫూర్తితో ఇంటర్నెట్‌లో ఛాటింగ్ చేసాడు. ఈసారి వాయిస్ ఛాట్. "హాయ్"

"హాయ్! ఏమయ్యారు?" స్ఫూర్తి ఉత్సాహంగా అడిగింది.

"ఏమీ కాలేదు. త్రివిక్రంగానే కొనసాగుతున్నాను."

"గుడ్ రెప్లై."

"మనం కాఫీ డేలో కలుద్దామని అనుకున్నట్లు గుర్తు? ఎప్పుడు కలుద్దాం?" అడిగాడు త్రివిక్రం.

"అలా అనుకోలేదే? ఐనా మీతో కలిసి పని చేసే అందమైన పెళ్ళి కాని నర్సులు కాని, డాక్టర్లు కానీ ఎవరూ లేరా? వారితో ఆ ముచ్చట తీర్చుకోవచ్చుగా?"

"ఉన్నారు. ఎవరైనా సిస్టర్స్‌ని కాఫీ డేకి తీసుకెళ్తారా?"

"సిస్టర్స్? గుడ్ రెప్లై. డాక్టర్లని తీసుకెళ్ళచ్చుగా?"

"కాఫీ డేకి పిలిస్తే డాక్టర్లు ఇరవై నాలుగు గంటలు దాటితే కాని ఏ సంగతీ చెప్పలేమంటున్నారు."

"గుడ్ రెప్లై. ఐనా మీ డాక్టర్లని కలవాలంటే నాకు భయం బాబూ."

"వెంట ఇంజెక్షన్ తీసుకురాను లెండి."

"నాలాంటి అందమైన అమ్మాయి మీద ధ్యాస ఉంచి ఆపరేషన్ అయ్యాక రోగి కడుపులో ఏ కత్తో, కత్తెరో మర్చిపోయి కుట్టేస్తూంటారు."

"మేం చాలా డెడికేటెడ్‌గా పనులు చేస్తాను, ఆ మాట ఎవరన్నారు?" పకపక నవ్వి అడిగాడు త్రివిక్రం.

"చాలాసార్లు పేపర్లో చదివానది."

"నేనడిగేది మీరు అందమైన అమ్మాయి అని ఎవరన్నారని?"

"వెవ్వెవ్వె."

"ఇంతకీ ఎప్పుడు కలుద్దాం?" ఉత్సాహంగా అడిగాడు త్రివిక్రం.

"లెట్ మీ సీ. ఈ వారం రాకేష్, సతీష్ రమేష్, సురేష్, నరేష్, ఉపేష్, నీలేష్‌లతో కాఫీ డేకి వెళ్తున్నాను. సమ్ టైం నెక్స్ట్ వీక్."

"పై బుధవారం?"

"చెప్పలేదా? నేను బాలానగర్ లోని ఓ ఇంజినీరింగ్ కంపెనీలో లేథ్ మెషీన్స్ మీద జరిగే పని మీద ఎంత ఆదాయం వస్తుందన్న ప్రాజెక్ట్ చేస్తున్నాను. ఇది నా చదువులో ఓ భాగం. నా టీంలో ముగ్గురం ఉన్నాం. ఒకరి కారుకి పెట్రోల్ షేర్ చేసుకుని వెళ్ళి వస్తూంటాం. నెక్స్ట్ వీక్ ఆ ప్రాజెక్ట్ పని నేను ఎగ్గొడితే పెట్రోల్‌ని ఇద్దరే షేర్ చేసుకోవాల్సి వస్తుంది. వాళ్ళు బాధపడతారు."

"ఆ పై వీక్. దాని గురించి ఇప్పుడే వద్దులెండి. మీరు అబద్ధం ఆలోచించుకోవాలి కదా."

"అందుకే మిమ్మల్ని ఇంటిలిజెంట్ అంటాను. అబద్ధం రెడీగా ఉంది. ఆపై వారం నాథ్, ధర్, ధన్, కర్, నీల్‌లతో కాఫీ షాప్‌కి వెళ్తున్నాను."

"పేర్లేమిటి చిత్రంగా ఉన్నాయి?"

"షార్ట్ కట్ చేసాను. వాళ్ళ పేర్లు గోపీనాథ్, మురళీధర్, మదన్, శ్రీకర్, సునీల్. అన్నట్లు చెప్పడం మరిచాను. నా మీద ఈ ఏడు కనీసం నూట ముప్పై ఏడుసార్లు రేప్ ప్రయత్నాలు జరగకుండా కాపాడబడ్డానని మీకు చెప్పానా?"

"సెభాష్! ఎలా?"

"ఆ నూట ముప్పై ఏడుమంది మగాళ్ళ సెల్ఫ్ కంట్రోల్ వల్ల."

"ఆ నిగ్రహేశ్వరరావులని మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నాను. నాకంత నిగ్రహం ఉండదు బాబూ."

వారి మధ్య అలా సరదా సంభాషణ కొద్దిసేపు సాగాక చెప్పింది స్ఫూర్తి.

"భోజనానికి టైమైంది. ఐ హేవ్ టు సైనాఫ్."

"ఓకే. గుడ్ నైట్."

"ఫూల్డ్ ఈజీలీ, ఆర్న్ట్ యు? నా భోజనం ఎప్పుడో అయిపోయింది. అది మర్యాద కోసం ఓ వంక మాత్రమే."

త్రివిక్రం నవ్వుకున్నాడు. తనూ సైనాఫ్ చేసి. అల్జీమీర్స్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ ఆర్నాల్డ్ నడిపే మై బ్రెయిన్ ట్యూనప్ డాట్ కాం లోకి వెళ్ళి కాసేపు అందులోని సమాచారం చదివాడు. అల్జీమీర్స్ చికిత్స పాశ్చాత్య దేశాల్లోని అభివృద్ధిని త్రివిక్రం వెబ్ సైట్ల ద్వారా ఫాలో అవుతున్నాడు. అయితే దానికి సరైన చికిత్స కనుచూపు మేరలో కనబడటం లేదు.

ఆ రాత్రి తండ్రి దగ్గర కూర్చుని డైరీలో ఆయన రాసుకున్నవి చదివి వినిపించాడు. కానీ అది సహాయం చేయలేదని అప్పటికే అర్థమైపోయింది. ఆ డైరీలోని ఓ కవిత త్రివిక్రంకి నచ్చింది.

*'నువ్వు పుట్టక మునుపే నేను నిన్ను కావాలనుకున్నాను.*
*నువ్వు పుట్టక మునుపే నేను నిన్ను ప్రేమించాను.*
*నువ్వు ఈ భూమి మీదకి రాక మునుపే నీ కోసం చావడానికి సిద్ధపడ్డాను.*
*ఇదే ప్రేమ చేసే గారడీ.'*

అలెగ్జాండర్‌కి కాలు బాగయ్యాక తిరిగి పడమటి యాలేరుకి బయలుదేరాడు. అనంతపూర్ వెళ్ళే రైల్లో ఎక్కించడానికి హాస్పిటల్‌నించి తన కార్లో తీసుకు వెళ్ళాడు త్రివిక్రం. రాత్రి తినడానికి సుందరేశ్వర్ చేసిచ్చిన భోజనం పార్సిల్‌ని ఇచ్చాడు. రైలు బయలుదేరబోయేముందు అడిగాడు త్రివిక్రం.

"భవిష్యత్‌లో మీ కార్యక్రమం ఏమిటి?"

"ప్రభువు సేవలో గడపటం మినహా నాకు ఇంకే కార్యక్రమాలు లేవు. ఓసారి నాకు జెరూసలేం వెళ్ళాలని ఉంది. ప్రపంచంలోని అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రం అది. మూడు ముఖ్య మతాలు అక్కడే పుట్టాయి. జుడాయిజం, ఇస్లాం, క్రిస్టియానిటీ. క్రీస్తు శిలువని మోస్తూ, కొరడా దెబ్బలు తింటూ నడిచిన ఇరుకైన దారి డోలారోజ్ పాస్ లేదా పాత్ ఆఫ్ సారో అక్కడ ఉంది. ప్రభువు నా కోసం కార్చిన రక్తం తడిసిన ఆ మార్గంలో ఆనాటి రేణువు ఒకటి నా ప్రభువుని తాకింది. నన్ను స్పర్శించినా చాలని నా ఆశ." ఆయన భక్తిగా చెప్పాడు.

తనకి అంత భక్తి ఉంటే బావుండును అనుకున్నాడు అలెగ్జాండర్ ఎక్కిన రైలు కదిలేదాకా త్రివిక్రం ఉన్నాడు.

త్రివిక్రంకి ఆఫ్ శనివారం వచ్చింది. ఆ రోజు కురంగేశ్వర్ ఉనికి తెలుసుకోవడానికి హైదరాబాద్‌కి సమీపంలోని సిద్దిపేటకి కారులో వెళ్ళాడు.

గాంధీ చౌక్‌ని కనుక్కోవడంలో ఎలాంటి ఇబ్బంది ఎదురవలేదు. అక్కడి ఓ చిల్లర దుకాణంలోకి వెళ్ళి అడిగాడు.

"సాంబశివుడు పూర్వం నడిపే చిల్లర దుకాణం ఇక్కడే ఉండేది. అది ఇంకా నడుస్తోందా?"

"సాంబశివుడి చిల్లర దుకాణమా?"

"అవును. అతని కొడుకు కురంగేశ్వర్ అని, హైదరాబాద్‌లో ఓ అమ్మాయిని రేప్ చేస్తే జైలు శిక్షకూడా పడిందతనికి."

ఆ మాటలు వినగానే అక్కడ పనిచేసే ఏభై ఏళ్ళతను వెంటనే చెప్పాడు.

"సాంబశివుడు ఇంకా ఎక్కడున్నాడు? ఏనాడో పోయాడు."

"కురంగేశ్వర్ ఎక్కడున్నారో తెలుసా?"

"అతను జైలు శిక్ష పూర్తయి వచ్చేసరికి తండ్రి పోవటం, ఇల్లు అన్యాక్రాంతం అవడం కూడా జరిగిపోయాయి. జిల్లా ఎస్పీ తమ్ముడు దాన్ని కబ్జా చేసాడు. వాళ్ళతో పోరాడే ఓపిక లేక, దానికి నీళ్ళు వదులుకుని హైదరాబాద్ వెళ్ళిపోయాడు."

"కురంగేశ్వర్ ఎక్కడున్నారో తెలుసా?"

"ఊహూ. మా తమ్ముడు, అతను స్కూల్ మేట్స్ ఆ రోజుల్లో అతని గురించి ఊరంతా చెప్పుకున్నారు. పేపర్లో అతని ఫోటో, కోర్టు కేసు వార్తలు వచ్చేవి."

"హైదరాబాద్‌లో ఎక్కడ ఉంటాడో తెలుసా?"

"తెలీదు. జైలు నించి వచ్చాక ఓ పట్టాన ఉద్యోగం దొరకలేదని, అతని మిత్రుడే తన చిట్‌ఫండ్ కంపెనీలో ఉద్యోగం ఇచ్చి ఆదుకున్నాడని విన్నాను."

"ఆ చిట్‌ఫండ్ కంపెనీ పేరు తెలుసా?"

"తెలుసు కాని మర్చిపోయాను."

"ఆ మిత్రుడి పేరు?"

"అదీ గుర్తులేదు. కోళందేశ్వరరావు అనే అతని ఇంటికి వెళ్తే వివరాలు తెలియచ్చు. అతను కురంగేశ్వర్ కొడుకు మిత్రుడు. కోళందేశ్వర రావు ఇంటి చిరునామా"

ఆ ఇల్లు తేలిగ్గా దొరికింది. అతను ఆర్మీలో పనిచేస్తున్నాడన్న గుర్తుగా ఇంట్లో ఫోటోల్లో అతను ఆర్మీ యూనిఫాంలో ఉన్నాడు. అతని సోదరి చెప్పింది.

"కురంగేశ్వర్ పెద్ద కొడుకు బ్రహ్మేశ్వర్, మా అన్నయ్య ఆర్మీలో ఒకే కంపెనీలో కలిసి పనిచేసారు. ఇద్దరూ తెలుగువాళ్ళే కాబట్టి స్నేహం కుదిరింది. మా అన్నయ్య ఆర్మీ నించి రిటైరై, తమిళనాడులో పెరంబూర్‌లో ఓ ఏన్సిలరీ ఇండస్ట్రీని నడుపుతున్నాడు. ఇప్పుడు కురంగేశ్వర్ వాళ్ళు ఎక్కడ ఉన్నారో మా ఇద్దరికీ తెలీదు."

కురంగేశ్వర్ హైదరాబాద్‌లో సుచిత చిట్ ఫండ్ కంపెనీలో పనిచేస్తున్నాడని ఓసారి ఆయన ఇచ్చిన కంపెనీ డైరీని చూసి ఆమె చెప్పింది.

హైదరాబాద్‌లో సుచిత చిట్‌ఫండ్ కంపెనీ బోర్డులని చూసిన గుర్తుంది త్రివిక్రంకి. అక్కడ ఓ హోటల్లో భోజనం చేసి కారులో వెనక్కి తిరిగాడు. సరాసరి హిమాయత్ నగర్‌లోని సుచిత చిట్‌ఫండ్ కంపెనీ ఆఫీస్‌కి చేరుకున్నాడు. అక్కడి ఉద్యోగస్థుల్లోని అరవై ఏళ్ళవాళ్ళకోసం చూసాడు. అందరికన్నా వృద్ధుడిలా కనిపించే ఒకతని దగ్గరికి వెళ్ళి అడిగాడు.

"కురంగేశ్వర్ గారు ఇక్కడే పని చేస్తున్నారా?"

"ఎవరు?"

"కురంగేశ్వర్."

"ఆ పేరే ఎన్నడూ వినలేదు."

"నగరంలో మీ బ్రాంచీలు ఇంకా ఎన్ని ఉన్నాయో? ఇంకో దాంట్లో పని చేస్తూండచ్చుగా."

"నగరంలో పదకొండు బ్రాంచీల్లోని అందరు ఉద్యోగస్థుల పేర్లు నాకు తెలుసు. కురంగేశ్వర్ అనే అతను మా దగ్గర పని చేయడంలేదు."

"అతను కొంతకాలం జైలు శిక్ష అనుభవించి బయటికి వచ్చాక, నైన్టీన్ ఎయిటీస్‌లో సుచితలో చేరాడు."

"జైలు శిక్ష అనుభవించి మా కంపెనీలో చేరాడా? అసాధ్యం."

"అతను ఈ కంపెనీ ప్రొప్రయిటర్ మిత్రుడని, అందుకని ఉద్యోగం ఇచ్చారని చెప్పారు."

"ఇది ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ. ప్రొప్రయిటర్ ఉండరు."

"ముప్పై ఏళ్ళ క్రితం బహుశా ప్రొప్రయిటరీ కన్‌సర్న్ అయి, తర్వాత లిమిటెడ్ కంపెనీగా మారి ఉండచ్చు."

"ఆయనతో మీకేం పని?"

"పర్సనల్ పని ఏర్పడింది. ఎవరు ఆయన గురించి చెప్పగలరు?"

"అమీర్‌పేటలో మా కంపెనీ హెడ్డాఫీస్ ఉంది. అక్కడ పర్సనల్ మేనేజర్ ధనిష్టని కలిసి అడగండి. ఆయన చెప్పగలుగుతాడు."

"థాంక్స్"

అమీర్ పేటలో ఆ ఆఫీస్ ఎక్కడుందో అడిగి వివరాలు తెలుసుకుని కమ్మ సంఘం సందులోని ఓ ఆఫీస్ కాంప్లెక్స్‌లో రెండో అంతస్థులో ఉన్న సుచిత చిట్‌ఫండ్స్ అండ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆఫీస్‌కి త్రివిక్రం చేరుకుని ధనిష్టని కలిసాడు.

"కురంగేశ్వర్ గురించి నేను విన్నాను. కానీ చూళ్ళేదు. ఇరవై ఏళ్ళ క్రితం ఓ ఫ్రాడ్ కేసులో ఆయన్ని తీసేసారు." ధనిష్ట చెప్పాడు.

"ఆయన వివరాలు చెప్పగలిగే ఉద్యోగస్థులు ఎవరైనా ఇక్కడ ఉన్నారా?"

"నాకది తెలీదు."

ఎదురుగా గోడమీద పోలీస్ యూనిఫాంలో ఉన్న ఏభై ఏళ్ళ వ్యక్తి ఫోటో కింద 'వ్యవస్థాపకులు కె.రఘునాథ్ ఐ.పి.ఎస్' అని రాసి ఉండటం చూసాడు. దానికి గంధపు మాల వేసి ఉంది.

"రఘునాథ్ అంటే హరినాథ్ తండ్రిగారా?" ఆ ఫోటో వంక వేలితో చూపిస్తూ అడిగాడు.

"అవును. ఆయనే తన భార్య పేర ఈ సుచిత చిట్‌ఫండ్స్‌ని స్థాపించింది. ఇప్పుడు హరినాథ్ గారే దీని యం.డి."

"అయితే నేనాయన్ని ఓసారి చూడాలి" ఉత్సాహంగా చెప్పాడు త్రివిక్రం.

"ఆయన ప్రస్తుతం ఇండియాలో లేరు. అమెరికాలోని తన పిల్లల దగ్గరకి వెళ్ళారు."

"మళ్ళీ ఎప్పుడు తిరిగి వస్తారు?"

"ఇంకో మూడు వారాల తర్వాత."

"అమెరికాలోని ఆయన ఫోన్ నెంబర్ దయచేసి ఇవ్వగలరా?"

"అంతదూరంలోని ఆయనతో మాట్లాడతారా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును."

"నాకా నెంబర్ తెలీదు ఆయనే అవసరం ఉంటే చేస్తూంటారు."

"థాంక్స్"

"ఒక్క నిమిషం. కురంగేశ్వర్‌తో పనిచేసిన ఒకాయన ఉన్నారు. పేరు శతభిషం. నాకు కురంగేశ్వర్ గురించి చెప్పింది ఆయనే. ప్రస్తుతం వరంగల్ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఫోన్ నెంబర్ కావాలంటే ఇవ్వగలను. ఆయనే మా చిట్‌ఫండ్ కంపెనీలో సీనియర్ మోస్ట్ ఉద్యోగి."

ఆయన ఓ చిన్న కాగితం మీద శతభిషం ఫోన్ నెంబర్ రాసిచ్చాడు. ధనిష్ఠకి థాంక్స్ చెప్పి త్రివిక్రం బయటకి నడిచాడు. కారు ఎక్కాక ఆ నెంబర్‌కి  ఫోన్ చేసాడు. ఎంగేజ్డ్. కారుని పోనించాడు. దాదాపు పదిహేను నిముషాల తర్వాత సెల్‌ఫోన్ మోగడంతో కారుని పక్కన ఆపి, దాన్ని ఆన్సర్ చేసాడు.

"హలో?"

"హలో! నా సెల్‌కి మీనుంచి ఇందాక ఓ కాల్ వచ్చింది?"

"మీరు శతభిషం గారేనా?"

"అవును. మీరు?"

"నమస్కారం. నా పేరు త్రివిక్రం. చిన్న సమాచారం కావాల్సి వచ్చి అమీర్ పేట ఆఫీస్‌లోని మీ పర్సనల్ మేనేజర్‌ని కలిస్తే, ఆయన మీ ఫోన్ నెంబరు ఇచ్చారు. కురంగేశ్వర్ ఇప్పుడు ఎక్కడ ఉన్నారో చెప్పగలరా?"

కొద్ది క్షణాల మౌనం తర్వాత అవతలనుంచి అడిగారు.

"మీరెవరు?"

"డాక్టర్ త్రివిక్రం. నేను సికింద్రాబాద్‌లో గాంధీ హాస్పిటల్‌లో సర్జన్‌గా పనిచేస్తున్నాను."

"ఆయనతో మీకేం పని?"

"పర్సనల్ పని ఉంది."

"కురంగేశ్వర్ నా మేనమామ. ఆయనే నాకీ ఉద్యోగం ఇప్పించారు."

"అయితే మీకు అసలు విషయం చెప్తాను. మీ మామయ్య ప్రమీలని బలాత్కారం చేసిన కేసులో జైలుకి వెళ్ళారు కదా? ఆ వివరాలన్నీ మీకు తెలుసా?"

"తెలుసు"

"ఆ ప్రమీల కొడుకుని నేను. కురంగేశ్వర్ నా తండ్రా అని డి.ఎన్.ఏ పరీక్ష ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాను. అందుకని వారిని కలవాలి."

"ఓ! ఆశ్చర్యంగా ఉందే? మా మామయ్య ఆయన కొడుకు దగ్గర ఉంటున్నారు."

"హైదరాబాదేనా?"

"మొన్నటిదాకా హైదరాబాద్‌లో సైనిక్‌పురిలోనే ఉండేవారు. మా మామయ్య కొడుకు బ్రహ్మేశ్వర్ నిజాంపట్నం దగ్గరున్న చిన్న ఊరు బావాజీపాలెంలో చిన్న ఇల్లు కొనుక్కుని అక్కడికి షిఫ్ట్ అయ్యాడు. దాంతో మా మామయ్య కూడా అక్కడికే వెళ్ళిపోయారు. మా మామయ్య అక్కడ పేద పిల్లలకి ఉచితంగా పాఠాలు చెప్తున్నారు."

"ఏ జిల్లా అది?"

"గుంటూరు జిల్లా.. కురంగేశ్వర్ ఇల్లెక్కడంటే ఎవరన్నా చెప్తారు."

ఎలా వెళ్ళాలో వివరంగా చెప్పాడు.

"థాంక్స్"

"ఆయన్ని కలిస్తే నా నమస్కారాలు చెప్పండి. ఆయన సెల్ ఫోన్ నెంబర్ రాసుకోండి."

త్రివిక్రం దాన్ని రాసుకున్నాడు. తర్వాత ఆ సెల్ ఫోన్‌కి ఫోన్ చేస్తే ఓ ఆడ కంఠం బదులు పలికింది. కురంగేశ్వర్ స్కూల్‌కి వెళ్ళాడని చెప్పారు. అంటే ఆయన ఊళ్ళోనే ఉన్నాడన్నమాట.

ఆ రాత్రే త్రివిక్రం రేపల్లెకి రైల్లో బయలుదేరాడు.

త్రివిక్రం రేపల్లెలో రైలు దిగి దగ్గరే ఉన్న ఓ హోటల్లో టిఫిన్ తిన్నాడు. తర్వాత బస్‌స్టాండ్‌కి చేరుకుని అక్కడ ఆగి ఉన్న నిజాంపట్నం బస్ కండక్టర్‌ని అడిగాడు.

"ఇది బావాజీపాలెం వెళ్తుందా?"

"ఇది ఎక్స్‌ప్రెస్. నిజాం పట్నానికి టికెట్ తీసుకుంటే బావాజీపాలెంలో ఆపుతాను. లేదా వెనక పేసెంజర్ వస్తుంది. అది ఎక్కండి." చెప్పాడు.

త్రివిక్రం కండక్టర్‌కి థాంక్స్ చెప్పి బస్ ఎక్కాడు. మరి కొద్ది గంటల్లో తను కురంగేశ్వర్‌ని కలవబోతున్నాడు. ఆయనే తన తండ్రి అయి ఉండచ్చా?

బస్ కదిలిన కాసేపటికి కండక్టర్ వచ్చి నిజాం పట్నంకి టిక్కెట్ ఇచ్చి డబ్బు తీసుకుని చెప్పాడు.

"బావాజీ పాలెం రాగానే బస్ ఆపుతాలెండి."

సజ్జావారి పాలెం, పల్లెపట్ల, దాసరిపాలెం, కొమరవోలు దాటాక బస్ బావాజీ పాలెం చేరుకుంది. కండక్టర్ ఆలోచనల్లో ఉన్న త్రివిక్రంతో చెప్పాడు.

"మీరు దిగాల్సింది ఇక్కడే"

వెంటనే లేచి తలుపు దగ్గరికి వెళ్ళేసరికే మిలటరీ యూనిఫాంలో ఉన్న ఒకతను తలుపు దగ్గరకి చేరుకున్నాడు.

బస్ ఆగాక అతని వెంటే కిందకి దిగాడు త్రివిక్రం. చుట్టూ చూసాడు. విశాలమైన రోడ్డు. దానికి అటు ఇటు అడ్డదిడ్డంగా ఆపిన తోపుడు బళ్ళమీద బొమ్మలు, పళ్ళు, చవక రెడీమేడ్ దుస్తులు, పాత్ర సామాగ్రి మొదలైనవి అమ్మకానికి ఉన్నాయి. కొన్ని రిక్షాలు అక్కడ ఆగి ఉన్నాయి.

ఆ సైనికుడు ఓ రిక్షా వాడితో మాట్లాడాక, రిక్షా అతను బస్ పైకెక్కి అందించిన రెండు పెద్ద నల్లరంగు ఇనప్పెట్టలని అందుకున్నాడా సైనికుడు. వాటిని రిక్షాలో ఉంచాక, త్రివిక్రం రిక్షాలాగే అతన్ని అడిగాడు.

"కురంగేశ్వర్ గారిల్లెక్కడ?"

"కురంగేశ్వర్ ?"

"పిల్లలకి ఫ్రీగా పాఠాలు చెప్తూంటాడు. వాళ్ళబ్బాయి ఆర్మీలో పనిచేస్తున్నాడు."

"ఆయన గోరా?"

రిక్షావాడు నడిచి వెళ్ళేంత దూరంలోని ఆ ఇంటికి ఎలా వెళ్ళాలో దారి చెప్పాడు. త్రివిక్రం పావుగంటలో ఆంజనేయస్వామి ఆలయం ఉన్న సందులోకి రిక్షావాడు చెప్పిన గుర్తుల ప్రకారం చేరుకున్నాడు. మూడు వందల ఇళ్ళు గల బావాజీ పాలెంలోని కురంగేశ్వర్ ఇంటిని తేలిగ్గా కనుక్కున్నాడు.

ఇసుక, కంకర, ఇటుకరాళ్ళ కుప్పల ఎదురుగా ఉన్న ఓ డాబా ఇంటి తలుపు ముందు ఆగాడు. డాబా మీద రెండు గదులు కడుతున్నారు లోపల ముందు గదిలో ఓ జంట కూర్చుని ఏదో చర్చించుకుంటున్నారు వారిని పిలిచినా మాటల్లో ఉన్నవారికి త్రివిక్రం పిలుపు వినపడలేదు.

మళ్ళీ గట్టిగా పిలిచాడు త్రివిక్రం.

అతను తలతిప్పి చూసి లేచి తలుపు దగ్గరికి వచ్చి అడిగాడు.

"ఎవరు కావాలి?"

"మీరు బ్రహ్మేశ్వరా? కురంగేశ్వర్ గారి ఇల్లేనా ఇది?"

"అవును. మీరెవరు?"

"నా పేరు త్రివిక్రం. హైదరాబాద్‌నుంచి వస్తున్నాను."

"ఏం పని?" ఆసక్తిగా అడిగాడు.

"పర్సనల్ పని."

"నాన్నని పోలీసులు రాత్రి స్టేషన్‌కి తీసుకెళ్ళారు." కొద్దిగా సిగ్గుపడుతున్నట్లుగా చెప్పాడతను.

"అదేమిటి? నిన్న నేను ఫోన్ చేస్తే స్కూలుకి వెళ్ళారని చెప్పారు?"

"నిన్న రాత్రి ఎనిమిదిన్నరకి పోలీసులు ఆయన్ని తీసుకెళ్ళారు."

"దేనికి?"

అంతదాకా మౌనంగా ఉన్న అతని భార్య ఆక్రోశంగా చెప్పింది.

"మా మామగారు ఏ తప్పు చేయలేదు. అంతా ఆ జానయ్య పనే?"

"జానయ్య ఎవరు?"

"ప్లంబర్. డాబాపైన రెండు గదులు కట్టిస్తున్నాం మా మామగారే ఆ వ్యవహారాలు స్వయంగా చూస్తున్నారు. నిన్న ప్లంబింగ్ వాడు వచ్చి పంపులు బిగించాడు కానీ, వాటిల్లోంచి నీళ్ళు చుక్కచుక్క కారసాగాయి. టెలిఫోన్ ఓవర్ పనిచేయలేదు అప్పటికే వాడి పనికి చెక్ ముట్టింది. దాంతో వాడు వెళ్ళిపోతే మళ్ళీ రాడని పని పూర్తిచేసి వెళ్ళమని మామగారు గట్టిగా చెప్పారు. వెంటనే వాడు ఉక్రోషంగా చొక్కా చింపుకుని వెళ్ళిపోయాడు. కొద్దిసేపటికి పోలీసులు వచ్చి జానయ్య తనని ఆయన కులం పేరుతో దూషించాడని రిపోర్ట్ ఇచ్చాడని, ఎస్సీ.ఎస్టీ అట్రాసిటి చట్టం కింద కేసుని నమోదు చేసి ఆయన్ని తీసుకెళ్ళారు. ఇవాళ సాయంత్రంలోపు మేజిస్ట్రేట్ దగ్గరకి తీసుకెళ్తారట. అంతదాకా మా మామయ్యకి కాని, మాకు కాని వాడి కులం ఏమిటో కూడా తెలీదు. జానయ్య అన్యాయంగా మా మామయ్య మీద కేసుని బనాయించాడు. సి.ఇకి నిజం తెలిసినా తను ఏం చేయలేకపోతున్నానని బాధపడ్డాడు. ఆయన చేసే సేవ అతనికి తెలుసు." ఆవిడ బాధగా చెప్పింది.

"నేను వెళ్ళి వాడిని అబద్ధపు కేసు దేనికి పెట్టావని అడిగాను. లక్షరూపాయలు ఇస్తే కేసుని విత్‌డ్రా చేసుకుంటానని చెప్పాడు." బ్రహ్మేశ్వర్ చెప్పాడు.

"పోలీస్ స్టేషన్ ఎక్కడుంది?" అడిగాడు త్రివిక్రం.

మరో అరగంటలో కురంగేశ్వర్ పెద్ద కొడుకు బ్రహ్మేశ్వర్‌తో పోలీస్ స్టేషన్‌కి చేరుకున్నాడు. కురంగేశ్వర్ పేరు చెప్పగానే ఎస్.ఐ వారిని గౌరవంగానే రిసీవ్ చేసుకున్నాడు. త్రివిక్రం తనని డాక్టర్‌గా పరిచయం చేసుకుని చెప్పాడు.

"ఓసారి కురంగేశ్వర్ గారితో నేను మాట్లాడొచ్చా?"

"అలాగే"

కురంగేశ్వర్‌ని సెల్‌లో కూడా ఉంచలేదు. సి.ఐ గదిలోనే కూర్చోపెట్టారు. ఎస్.ఐ ఆ గదిలోకి వెళ్ళమని కోరాడు. సి.ఐ.లేడు. కురంగేశ్వర్ ఒక్కడే ఓ కుర్చీలో కూర్చుని దినపత్రికని చదువుతున్నాడు. ఆయన మొహం అలసటగా ఉంది. పక్కన ఆయన చిన్నకొడుకు కూర్మరాజు కూర్చుని ఉన్నాడు.

"వీరు మీతో మాట్లాడాలని హైదరాబాద్‌నుంచి వచ్చారు" బ్రహ్మేశ్వర్ చెప్పాడు.

ఆయన త్రివిక్రం వైపు ఆసక్తిగా చూసాడు.

"జానయ్యతో మళ్ళీ మాట్లాడావా?" కూర్మరాజు బ్రహ్మేశ్వర్‌ని అడిగాడు.

"మాట్లాడాను. లక్షకి తగ్గనంటున్నాడు. ఇచ్చేద్దామా? ఈ కేసుకి బెయిల్ దొరకదని తప్పు చేయలేదని మనమే ఋజువు చేసుకుంటే తప్ప, చట్టం దృష్టిలో మనం తప్పు చేసినట్లేనని లాయర్ చెప్పాడు."

"జైలు నాకు కొత్తకాదు. జైలు శిక్షయినా అనుభవిస్తాను కానీ బ్లాక్ మెయిల్‌కి లొంగద్దు. చెక్ కేష్ అవకుండా ఆపేసావా?" కురంగేశ్వర్ అడిగాడు.

"ఇవాళ ఉదయం నేను బేంక్‌కి వెళ్ళేసరికే వాడు చెక్‌ని కేష్ చేసేసుకున్నాడు. వాడు బయటికి వస్తున్నాడు .నేను లోపలికి వెళ్తున్నాను. జస్ట్ నిమిషం తేడా." విచారంగా చెప్పాడు బ్రహ్మేశ్వర్.

"అరెరె"

కురంగేశ్వర్ మరి కొద్దిసేపు వారితో తన కేసు గురించి చర్చించాక త్రివిక్రం వైపు తిరిగాడు. అంతదాకా ఆయన పోలికలు తనలో ఉన్నాయా అన్న దృష్టితో త్రివిక్రం కురంగేశ్వర్ వంకే దీక్షగా చూడసాగాడు.

"నాతో మీరు మాట్లాడదల్చుకుంది దేని గురించి అన్నారు?" ఆయన అడిగాడు.

"మనం ప్రైవేట్‌గా మాట్లాడుకుంటే బావుంటుందేమో?" సూచించాడు త్రివిక్రం.

వెంటనే ఆయన ఆశ్చర్యంగా చూసాడు.

"ప్రమీల గురించి మీతో మాట్లాడాలి" త్రివిక్రం గొంతు తగ్గించి చెప్పాడు.

ఆ పేరు వినగానే కురంగేశ్వర్ మొహంలో స్వల్పంగా విస్మయం కనిపించింది. మొహం కూడా కొద్దిగా పాలిపోయింది. చిన్నగా తల పంకించాడు.

అప్పటికే కూర్మరాజు బయటికి వెళ్ళి ఓ టీ బంక్‌లో టీ ఇవ్వమని చెప్పడంతో ఓ చిన్న కుర్రాడు కెటిల్, ప్లాస్టిక్ గ్లాసులతో లోపలికి వచ్చి అందరికీ టీ ఇచ్చి, డబ్బు తీసుకుని వెళ్ళాడు.

"వాడు ఎటూ చెక్‌ని కేష్ చేసుకున్నాడు కాబట్టి మేజిస్ట్రేట్‌తో చెప్పండి నాన్నగారూ, డబ్బు తీసుకుని పని సరిగ్గా చేయనందుకు గట్టిగా అడిగితే ఈ కేసు బనాయించాడని" టీ తాగుతుండగా చెప్పాడు కూర్మరాజు.

"ఇందాక సి.ఐ అంటున్నాడు కేసు దర్యాప్తు చేసిన తనకి, కస్టడీకి పంపే మేజిస్ట్రేట్‌కి ఈ కేసు అన్యాయం అని తెలిసినా వారిద్దరూ ఏం చేయలేరని. తామిద్దరూ కూడా ఎస్సీ ఎస్టీలకి చెందనివారు కాబట్టి, ఆ కారణంగా సరైన ఏక్షన్ తీసుకోలేదని ఆ వర్గం వారంతా గ్రూపుగా వచ్చి ధర్నా చేస్తే కేసు తమ మీదకే బూమరాంగ్ అవ్వచ్చని భయపడుతున్నారు" కురంగేశ్వర్ నిస్పృహగా చెప్పాడు.

"గుడ్డిలో మెల్లన్నట్లుగా వాడు డబ్బిస్తే కేసు విత్‌డ్రా చేసుకుంటానని అంటున్నాడు. కొంతమంది కసిగా జైలుకి పంపాలని ఆ ఆప్షన్ కూడా ఇవ్వరు. డబ్బిచ్చి బయటపడటం మంచిది నాన్నా" బ్రహ్మేశ్వర్ నచ్చచెప్పాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి

www.anandbooks.com
www.telugubooks.in